అక్రమ నిర్మాణం కూల్చివేత

హైడ్రా అందించిన నివేదికలో మన్సూరాబాద్ ఆక్రమణల వివరాలు



జీహెచ్ఎంసీ స్థలమని బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలో నిబంధనల మేరకు సెట్‌బ్యాక్‌తో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన కొన్నేళ్ల తర్వాత సెట్‌బ్యాక్ స్థలాన్ని సదరు యజమాని చదును చేయటానికి ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.ఈ సమస్యపై జూన్ 29న 'రూ.3 కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ సర్కిల్ టౌన్‌ప్లానింగ్, హైడ్రా అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జూలై 1న ఆక్రమణలను కూల్చివేసి ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం కూల్చివేతలపై హైడ్రా అందించిన నివేదికలో మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన రోడ్డును ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేసి జీహెచ్ఎంసీ స్థలమని బోర్డు ఏర్పాటు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు.

సీఎంపై దుష్ప్రచారం మానుకోవాలి


మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డిపై దుష్ప్రచారం మానుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశంలో దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. చెరువులను మింగిన గత పాలకులు హైడ్రా అంటే భయపడుతున్నారని చెరువులను కబ్జా చేసిన వారి కోరలు పీకేందుకే సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైడ్రా ఏర్పాటైందన్నారు. బీజేపీకి మత రాజకీయాలకు తప్పా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన లేదన్నారు. ఈ సమావేశంలో ఉపేందర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్ రావు, రమేష్ నేత, మహేందర్, లింగస్వామి గౌడ్, యాదవ రెడ్డి, దుబ్బాక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తసంబంధం కన్నా పార్టీ సంబంధం గొప్పది

ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

చైతన్యపురి: రక్తసంబంధం కన్నా పార్టీ సంబంధం గొప్పదని, పార్టీ జెండా, సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన వారు ఎంతో మంది ఉన్నారని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామరంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని హోటల్ బృందావన్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన జాతీయ దళిత మోర్చా కార్యదర్శి కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే రాష్ట్రంలో 2024 లోకసభ ఎన్నికల ఫలితాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ వరుసగా మూడు దఫాలుగా అధికారంలో ఉందంటే అందుకు కారణం ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పోలింగ్ బూత్ వారీగా తొంభై శాతం సభ్యత్వ నమోదు చేయడమే జిల్లా ఎజెండా అన్నారు. అనంతరం ప్రధాని 113వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

చంపాపేట: చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బైరామల్‌గూడ గ్రామ దేవత గండమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, రఘునందన్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నెంబర్-1 లో ఉన్న కాలనీ అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంత్రి హోదాలో సబితాఇంద్రారెడ్డి సంక్షేమ భవనానికి దాదాపు రూ. 35 లక్షలు కేటాయించడం జరిగిందని నిధులు సరిపోక పనులు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భవన నిర్మాణం కోసం అధిక నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆ నిధులను వెంటనే కేటాయించి భవనం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే సరస్వతి దేవాలయం రోడ్డు నీట మునిగి దేవాలయంతో పాటు ఇళ్లలోకి నీరు చేరుతుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.44 లక్షలు మంజూరు చేయించారన్నారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన పనులను కాలనీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, శ్యాం గుప్తా, కపిల్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి


దస్తావేజులు చూపిస్తున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు

మన్సూరాబాద్: తమ ప్లాట్లను కబ్జా చేయాలని యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమలింగేశ్వరనగర్ ప్లాట్ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చంచల్‌రావు, కార్యదర్శి ఎంవీ రావు, కోశాధికారి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి వద్ద సోమలింగేశ్వర నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాగ్ హయత్‌నగర్ సర్వే నెంబర్ 180,187లో స్థల పట్టాదారులైన జెల్ల భిక్షమయ్య, జెల్లా అచ్చిలింగంలో 1983లో లేఅవుట్ చేశారు. 1983 నుంచి 1986 వరకు 101మంది వేరువేరు శాఖలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ పట్టాదారుల వద్ద ప్లాట్లను కొనుగోలు చేశామని ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నందున మా విధుల్లో బిజీగా ఉండటంతో ప్లాట్ల వద్దకు రాలేకపోయామన్నారు. ఇదే అదనుగా భావించిన పట్టాదారుల వారసులు 1997లో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాకు యత్నించగా ఈ విషయమై కోర్టులో వివాదం జరిగిందన్నారు. తీర్పు మా అసోసియేషన్‌కు అనుకూలంగా వస్తుందని తేలడంతో పట్టాదారుల వారసులు తమ పిటిషన్లను వాపసు తీసుకోవడంతో కోర్టు తీర్పు మాకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయినప్పటికి పట్టాదారుల మూడోతరం వారసులతో కలిసి ఓ వ్యక్తి కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళ్లాడు. 2018లో హైకోర్టు తీర్పు సోమలింగేశ్వరనగర్‌కాలనీ అసోసియేషన్‌కు అనుకూలంగా వచ్చినప్పటికి కబ్జాదారుడు బెదిరింపులకు పాల్పడుతుండటంతో ప్లాట్ల వద్దకు రాలేకపోయామన్నారు. తమ ప్లాట్లకు సంబంధించిన అన్ని దస్తావేజులు ఉన్నాయని కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- యునానీ వైద్యానికి పెరుగుతున్న ఆదరణ
- సౌకర్యాలు లేక రోగులకు ఇక్కట్లు
- వసతులు కల్పిస్తే మరింత మెరుగైన వైద్యం అంటున్న వైద్యాధికారులు


స్థలం లేకపోవడంతో స్థానిక కమ్యూనిటీ హాల్లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అరకొర వసతులున్నా.. ఆయుష్ పోస్తున్నారు!


పురాతన ఇరుకైన గదిలో చంపాపేట ఆయుష్ కేంద్రం

చంపాపేట: మన దేశంలో అతి పురాతనమైన వైద్యం ఆయుర్వేదం. మారుతున్న కాల పరిస్థితులు, కాలుష్యాలు, ఆహారపు అలవాట్ల ప్రభావంతో వైద్య నిపుణులకే సవాళ్లు విసురుతూ వైరస్‌లు పంజా విసురుతున్నాయి. అయితే దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టే యునానీ (ఆయుర్వేద) వైద్యంపై ప్రజలు దృష్టి పెడుతున్నారు. చంపాపేట పాతబస్తీలో గత మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యునానీ కేంద్రానికి గత రెండేళ్ల నుంచి రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతీరోజు కేంద్రానికి 50- 70 మంది రోగులు బీపీ, షుగర్, చర్మ, కీళ్లు, స్త్రీ సంబంధిత వంటి పలు దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవడానికి ఇక్కడి బారులుతీరుతారు.

నిండుకున్న సమస్యలు..

చంపాపేటలోని 5 దశాబ్దాల ఇరుకైన పురాతన మహిళా భవనంలో రెండు గదులు ఉండగా కేవలం ఓ చిన్న గదిలో మూడు దశాబ్దాల క్రితం ఆయుష్ కేంద్రం ఏర్పాటుకు కేటాయించారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుండంతో రోగులు కూర్చునేందుకు అవకాశం లేకపోవటంతో రహదారి మీదనే గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అక్కడికొచ్చేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా రోగుల సౌకర్యార్థం కేంద్రంలో టాయ్‌లెట్స్ కూడా లేకపోవటమే కాకుండా కనీసం తాగేందుకు నీరు, నిలిచేందుకు నీడ కూడా లేదని వాపోతున్నారు.

ఒకే గదిలో..

ఒకే చిన్న ఇరుకైన గదిలో పదుల సంఖ్యలో వైద్య సిబ్బంది, రోగులు, మందుల నిల్వలు ర్యాక్‌లు, వైద్య పరీక్షా పరికాలు ఉండటంతో మహిళలకు వైద్య పరీక్షలు చేయటం మెడికల్ ఆఫీసర్‌కు కూడా ఇబ్బందిగా మారుతుందని రోగులు ఆవేదన చెందుతున్నారు. కేంద్రంలో అన్నిరకాల రోగాలకు మందులు, పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉన్నా అరకొర వసతులతో ఇక్కట్లు తప్పటం లేదని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రస్తుత ఆయుష్ కేంద్రం సమీపంలోని ప్రభుత్వ 100 గజాల ఖాళీ స్థలంలో అన్నిరకాల వసతులతో ఆయుర్వేద వైద్య కేంద్ర భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

దీర్ఘకాలిక రోగాలకు మెరుగైన చికిత్స..



దీర్ఘకాలిక రోగాలైన మధుమేహం, రక్తపోటు, అజీర్తి, కడుపులో మంట, మలబద్ధకం, అర్షమొలలు, థైరాయిడ్, స్త్రీ సంబంధిత వంటి పలు వ్యాధులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాం. కేంద్రంలో వసతుల కొరత ఉన్నా నిత్యం 70 మంది వైద్య పరీక్షలకు వస్తున్నారు. స్థలం లేక కాలనీ సంక్షేమ సంఘం భవనంలో వైద్యం అందిస్తున్నాం. -డా. అస్మా అంజుం, మెడికల్ ఆఫీసర్

పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలి



నేను రెండేళ్ల నుంచి కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్నా. కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఎక్కువసేపు వేచి చూడాల్సి వస్తుంది. నీటి వసతి, టాయ్‌లెట్స్, కూర్చునేందుకు బెంచీలు లేవు. ఇరుకుగదిలో పురుషుల మధ్యనే వైద్య పరీక్షలు చేయించుకునే దుస్థితి ఏర్పడుతుంది. అన్ని వసతులు ఉన్న భవనంలోకి మార్చాలి.
-లక్ష్మమ్మ, చంపాపేట

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.17, వంకాయ రూ.23, బెండ రూ.23, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.50, దొండ రూ.21, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.50, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.25, కీర రూ.28, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు మాదన్నపేట గోశాలలో వేడుకలు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట మార్కెట్ గోశాల (శ్రీవీరాంజనేయ స్వామి గోశాల) శ్రీకృష్ణ దేవాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఉగాది మహేష్ తెలిపారు. భక్తుల సందర్శనార్థం గోశాల రోజు మొత్తం తెరిచి ఉంటుందన్నారు.

చెరువులను పరిరక్షించాలి


రంగారెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని తెలంగాణ జన సమితి ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కేవీ రంగారెడ్డి కోరారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల కబ్జాకు నాటి కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కారణమన్నారు. కబ్జాదారులు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో చేరి ప్రభుత్వ భూములను లాక్కుంటున్నారన్నారు. చెరువులను పరిరక్షించకుంటే భావితరాలకు ఇబ్బందులు తలెత్తుతాయని గుర్తించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి కబ్జాదారులను గుర్తించి చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు హైడ్రాకు సహకరించి, చెరువులను రక్షించుకోవాలన్నారు.

రెండోసారి చిక్కితే జైలుకే..

చాదర్‌ఘాట్: అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు గురి చేసే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలుకు పంపుతామని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టి కేసులు నమోదైన వారి పూర్తి వివరాలను రికార్డుల్లో చేరుస్తున్నామని వారి చిరునామా ఫోన్‌నెంబర్లు, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువుల వివరాలను కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. రెండవసారి పెట్టి కేసు నమోదైతే జైలుకు పంపిస్తామన్నారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

యువతి అదృశ్యం


మల్లేశ్వరి

నాగోలు: ఉద్యోగానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మమత నగర్ కాలనీలో ఉండే జి. మల్లేశ్వరి(26) నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 24న విధులకు వెళ్లిన మల్లేశ్వరి రాత్రైనా ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. 25వ తేదీన తాను సూర్యాపేటకు చెందిన సాయితో పెళ్లి చేసుకోబోతున్నట్లు కుటుంబ సభ్యులకు మెసేజ్ చేసింది. మల్లేశ్వరి కోసం వివిధ ప్రాంతాలల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తండ్రిపై కుమారుడి దాడి

- మనస్తాపంతో ఆత్మహత్య

నాగోలు: కొడుకు వేధింపులు తాళలేక తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ డాక్టర్ కాలనీలో ఉండే బత్తిని శ్రీరాములుగౌడ్(57) భార్య మణెమ్మ, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. గత కొన్ని రోజులు అతని కుమారుడు మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతుండగా శ్రీరాములు మార్కెట్‌లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు తండ్రిని మార్కెట్‌లో రావద్దంటూ చెప్పేవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య చిన్న చిన్న గొడవలు చోటు చేసుకుంటున్నాయి. గత వారం శ్రీరాములుగౌడ్‌పై కుమారుడు దాడి చేశాడు. మనస్తాపానికి గురైన శ్రీరాములుగౌడ్ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. శనివారం రాత్రి ఎన్టీఆర్‌నగర్‌లో ఉండే తన స్నేహితుడు వద్ద వచ్చి జరిగిన సంఘటన చెప్పి తాను చనిపోతానని చెప్పాడు. స్నేహితుడు అతని సర్దిచెప్పి అక్కడ నుండి పంపించాడు. ఆదివారం తెల్లవారుజామున మార్కెట్‌లో రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

నాగోలు: రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో బఫర్ జోన్లలో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన ఆస్పత్రులు, ఫంక్షన్ హాళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లు అక్రమ కట్టడాలను సైతం హైడ్రా కూల్చి వేయాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్ ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ లో భూములు ఆక్రమించుకున్న వారి కట్టడాలను కూల్చి ప్రభుత్వం భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు.

'భక్తితత్వం లేకుండా హిందూమతమే లేదు'


కళాకారులను సత్కరిస్తున్న విజయశంకరస్వామి

వనస్థలిపురం: భక్తితత్వం లేకుండా హిందూమతమే లేదని, భక్తిని ఆవిష్కరించే అసంఖ్యాక కళల వల్లే హిందూమతం సజీవంగా ఉందని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అన్నారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వనస్థలిపురంలోని వినాయక నాట్యమండలి (సురభి) ప్రాంగణంలో నిర్వహించిన భాగ్యనగర 'హైందవ భక్తి కళా సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందూధర్మంలో విభిన్న ప్రవంతులు, సంప్రదాయాలు ఉన్నా కేవలం భక్తి సంప్రదాయమే హైందవ సంస్కృతికి జీవగర్రగా ఉందన్నారు. విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ.. హైందవ భక్తి కళలకు సంబంధించిన ఈ సమ్మేళనం అత్యంత విశిష్టమైనదని అన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, భరతనాట్యం, యక్షగానం, చిందు, బుర్రకథ, కోలాటం, చెక్కభజన వంటి భజన సంప్రదాయాలకు చెందిన కళా బృందాలు తమ కళారూపాలను ప్రదర్శించారు. అనంతరం వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దరూరి నరసింహాచార్యులు, శివస్వామి, విజయారెడ్డి, చినుకు మూర్తి, అక్కిరాజు సుందర రామకృష్ణ, తెలుగు వెలుగు శ్రీరామ్ దత్తు, మాతా పరమేశ్వరానందమయి పాల్గొన్నారు.

మాదన్నపేట మండీలో ఘనంగా బోనాలు


పోతరాజుల విన్యాసాలు

చంచల్‌గూడ: శ్రావణ మాసం సందర్భంగా మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో ఆదివారం కూరగాయల వ్యాపారులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం భూలక్ష్మీ అమ్మవారికి మహిళలు సామూహికంగా బోనాలు సమర్పించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రుద్ర నర్సింహా, బీజేపీ నాయకులు వీరేందర్‌బాబు యాదవ్, ఉగాది మహేష్, నరేందర్, శ్రీకాంత్ యాదవ్, నాగరాజు, వరుణ్ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలి


జయంతిలో పాల్గొన్న అజయ్‌కుమార్ యాదవ్

వనస్థలిపురం: బీసీ రిజర్వేషన్ పితామహుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్)కు భారతరత్న ఇవ్వాలని ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.దాసరి అజయ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం యశోదనగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీపీ మండల్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ జయంతి, వర్ధంతిను అధికారికంగా నిర్వహించాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలన్నారు. దేశవ్యాప్తంగా కుల గణనలో భాగంగా ఓబీసీ కుల గణనను ప్రత్యేకంగా చేపట్టి, మండల్ కమిషన్ సూచించిన సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ హామీని నిలబెట్టుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ యాదవ్, దాసరి కార్తీక్ యాదవ్, వెంకట్, చింటూ, నాగరాజు, రాజు, పరుశురామ్, లింగం యాదవ్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం


స్థానికులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

నాగోలు: కాలనీల్లో డ్రైనేజీ సమస్య లేకుండా చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. స్నేహపురి కాలనీలో ఆదివారం ఆయన స్థానికులతో కలిసి పర్యటించారు. నాలాలు లేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్య కూడా ఎక్కువగా ఉందని చెప్పడంతో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులను కోరారు. వీధి కుక్కల బెడద, శానిటైజేషన్ తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేట్ వెంట కాలనీవాసులు మహేందర్, వెంకట్ రావు, తిరుమల్ రెడ్డి, రవీందర్ బాబు, భాస్కర్ రావు, యాదగిరి, శాంతమూర్తి ఉన్నారు.

కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి


ప్రహరీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సౌభాగ్యనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ ప్రహరీని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రఘురాం నేత, శ్రీధర్‌రావు, నందకిషోర్, ఆంజనేయులు, లక్ష్మణ్, సురేష్, చిత్తరంజన్, రాఘు రామ్, శ్రీశైలం, విజయ్ కుమార్, లక్ష్మిపతి, యాదయ్య, భవాని, రాజు, శేఖర్, రవి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



వనస్థలిపురం/దిల్‌సుఖ్‌నగర్: వనస్థలిపురంలోని నారాయణ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం హేమంబర్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవాని, కోఆర్డినేటర్ గాయత్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ సుమారాణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



మీర్‌పేట: స్థానిక శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం ఆలయ కమిటీ, శ్రీ గాయత్రి సేవా సంఘం మీర్‌పేట వారి ఆధ్వర్యంలో సామూహిక సహస్రనామ కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు. పూజల్లో కమిటీ సభ్యులు సంతోష్ రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకటరమణ, గాయత్రి సేవా సంఘం సభ్యులు శ్రీనివాస ప్రసాద్, శివరామ ప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9912220363
9505507616 | 9912220365